www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 15 ఆగస్టు 2023



'ఎన్‌జిఒ' మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-మండపేట


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 21 ఎన్‌జిఒరాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ సోమవారం జరిగింది. ఈనెల 21,22 తేదీల్లో విజయవాడలో జరగబోయే 21వ ఎన్‌జిఒ మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎల్ సుధారాణి, మాధవి దేవి, కృష్ణవేణి, వెంకట్రావు, ఈశ్వరరావు, రామకృష్ణ, సత్యనారాయణరెడ్డి, రమణ తదితరులు పిలుపునిచ్చారు.

'స్పందన'లో ప్రజా సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-అమలాపురం

స్పందన కార్యక్రమంలో అర్జీదారుల సమస్యల పరిష్కారంలో నాణ్యతను పెంచడం అనేది ప్రధాన లక్ష్యం కావాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లాస్థాయి అధికా రులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాల్ నందు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి సుమారుగా 238 అర్జీలను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబులు స్వీకరించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని నిర్దేశిత సమయంలోగా నాణ్యతతో


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారునికి సంతప్తికర స్థాయిలో పరిష్కార మార్గాలు పూర్తిగా చూపాలన్నారు. వ్యక్తిగత ఫిర్యాదులు, కుటుంబ స్థాయిలో వచ్చే ఫిర్యాదులను నమోదు చేసిన తర్వాత నిర్ణీత వ్యవధిలో పరిష్క రించాలన్నారు. గడువు దాటిన అర్జీలు లేకుండా, ఒకసారి అందిన దరఖాస్తు మరల రీఓపెన్ కాకుండా అధికారులు అన్ని మెళకువలు జాగ్రత్తలు వహించా లన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ పద్మశ్రీ రాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర, డిపిఒ పి.కష్ణకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసు బాబు, నోడల్ అధికారి భీమేశ్వరరావు, జిల్లా నీటియాజమాన్య సంస్థ పిడి ఎస్ మధుసూదన్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎస్.సుధా సాగర్, జిల్లా ఉద్యాన అధికారి బివి.రమణ, డిఆర్‌డిఎ పి డి వి.శివశంకర్ ప్రసాద్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి జివి.సత్య వాణి తదితరు లు పాల్గొన్నారు.

మణిపూర్ మారణకాండను అరికట్టాలి

జనజాగరణ లో ప్రజాసంఘాలు

ప్రజాశక్తి-అమలాపురం

మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణకాండ అరికట్టి హింసకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని, మణిపూర్ ప్రజలకు రక్షణ కల్పించాలని, ఆ రాష్ట్రంలో శాంతి చేకూర్చే విధంగా కేంద్రం చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బిజెపికి స్వాతంత్ర్యం గురించి మాట్లాడే అర్హత లేదని దేశంలో కాంగ్రెస్ పార్టీ కంటే ముందు కమ్యూనిస్టులు స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద జరిగిన జన జాగరణ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు అన్నారు. దేశ స్వాతంత్ర్యం ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని పరిరక్షించు కోవాలని అన్నారు.స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనని బిజెపి, ఆర్ఎస్ఎస్ నేడు మేమే దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చామని ప్రచారం చేసుకోవడం దారుణం అని అన్నారు. మత విద్వేషాన్ని భాగోద్వేగాన్ని రెచ్చగొట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేయడమే బిజెపి ప్రభుత్వం అజెండా అని అన్నారు. ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు ప్రాణాలు అర్పించి స్వాతంత్ర్యం సాధించారన్నారు. కమ్యూనిస్టు పార్టీ పరిపాలిస్తున్న కేరళలో మతానికి, రాజకీయానికి ముడి పెట్టరని మత స్వేచ్ఛ ఉంటుందని అన్నారు. బిజెపి ప్రభుత్వం సావర్కర్ ను స్వాతంత్ర్య సమరయోధుడిగా చిత్రీకరిస్తోందన్నారు. భారతదేశంలో మత స్వేచ్ఛ కావాలని భిన్నత్వంలో ఏకత్వంగా నివసించే దేశంలో బిజెపి మతాల కులాలు ప్రాంతాలంటూ విభజించి పాలిస్తోందని అన్నారు. తెలంగాణలో సాయుధ పోరాటం కమ్యూనిస్టు


ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు, ప్రజా సంఘాలు

ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు స్వేచ్ఛ స్వాతంత్ర్యం లభించాయని ఆయన గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీ మాత్రమే స్వాతంత్ర్యం ఉద్యమానికి నిజమైన వారసులని చెప్పుకునే ధైర్యం ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి. దుర్గాప్రసాద్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.రామచంద్రరావు, బుంగ సత్యనారాయణ, .వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, జి.దైవకప, పాము బాలయ్య, తాడి శ్రీరామమూర్తి, సిఐటియు భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు బీమాల శ్రీను, మున్సిపల్ వర్కర్స్ నాయకులు నిమ్మకాయల వెంకటేష్, బేవరేజ్ యూనియన్ నాయకులు నక్కా సతీష్, పల్లి రామకృష్ణ, గుద్దటి వెంకటేశ్వరరావు, సీరెడ్డి బాబ్జి, మరియమ్మ, పర్వతాలు పిడిఎస్‌యు నాయకులు ఎం.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తికి తలమానికం మిలటరీ పేట

ప్రజాశక్తి-కాట్రేనికోన

అది డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఒక పల్లెటూరు. ఆ గ్రామంలోని ప్రజలు తరతరాలుగా భారతదేశ రక్షణకొరకు కవచంలా నిలబడుతున్నారు. ఇండియన్ ఆర్మీలో జవాన్లుగా చేరి దేశ రక్షణ విధులలో పాలుపంచుకొంటున్నారు. దేశ రక్షణకు సరిహద్దుల్లో పనిచేయడానికి ఎవరైనా వెళితే తమ కుమారుడు మిలటరీలో పనిచేస్తున్నాడని తల్లిదండ్రులు గొప్పగా చెప్పుకొంటారు. జవానుకు ఉన్న గొప్పతనం, గౌరవం అలాంటిది. ఒక ఊరికే ఆ పేరొస్తే ఎంత ఆనందంగా ఉంటుందో కదా. కాట్రేనికోన మండలం కందికుప్ప పంచాయతీ శివారు మిలటరీపేట ఆ ఘనత పొందింది.కాట్రేనికోన మండలంలోని కందికుప్ప గ్రామ పంచాయతీ పరధిలో ఉన్న ఈ గ్రామానికి సుమారు 55ఏళ్ల క్రితంనుండే మిలటరీ పేటగా పేరు స్థిరపడింది..మొదటగా ఈ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులుభారత సైన్యంలో చేరి సేవలందిస్తూ సెలవుల సమయంలో స్వగ్రామాలకు వచ్చి గ్రామంలోని పలువురు యువకులను సైన్యంలో చేరేలా వారిలో దేశభక్తిని పెంపొందిస్తూ ప్రోత్సహించడంతో గ్రామంలోని అనేకమంది యువకులు ఇండియన్ ఆర్మీలో చేరారు.మిలటరీ పేటలో ఒకే కుటుంబానికి చెందిన అన్నయ్య,


ప్రశంసాపత్రం అందుకుంటున్న సోమరాజు

తమ్ముడు, బాబాయ్, పెదనాన్న, బావ, బావమరిది ఇలా పన్నెండు మంది ఇప్పటికీ ఆర్మీలో సేవలందించడం విశేషం. గ్రామంలో మొదటగా ఆర్మీలోచేరి ఇక్కడి యువకులకు ఆదర్శంగా మారి గ్రామానికి మిలటరీపేటగా పేరు సార్థకం అయ్యేందుకు దోహదపడిన జనిపెల్ల సోమరాజును గ్రామంలోని ప్రజలు ఇప్పటికీ స్మరించుకుంటారు . పలువురు యువకులు సోమరాజు స్ఫూర్తితో సైన్యం లో చేరేలా దేహదారుఢ్యం, ఇతర కసరత్తులు చేస్తూ నిరంతరం సన్నద్ధం అవుతూ శిక్షణ పొందుతున్నారు. భారతదేశం బ్రిటీష్ వారి కబంధ హస్తాలనునుండి విడువడి డెబ్బై ఆరు సంవత్సరాలు గడిచిన సందర్భంగా భారతప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీకా అమత్ మహోత్సవ్‌లో అమర జవానులను స్మరించు కుంటూ మిలటరీపేటను ఆదర్శంగా తీసుకుని మరికొందరు యువకులు అర్మీలో చేరాలని ఆశిద్దాం.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి - అంబాజీపేట

ముక్కామల హైస్కూల్లో మధ్యాహ్నం భోజనాన్ని ఆహార కమిషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్ సోమవారం పరిశీలించారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాల ద్వారా భోజనంలో పురుగులు వస్తున్నాయని ఫిర్యాదుతో ఆయన స్పందించి పరిశీలించారు. స్టాకు వెరిఫికేషన్ చేసి 5 నెలలుగా నిల్వ ఉన్న 21 బస్తాలను వెంటనే మార్చి కొత్త స్టాకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఎంఇఒ కాంద్రేగుల వెంకటేశ్వరరావు ను ఆదేశించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక సంగమేశ్వర కాలనీలో ఎంపిపి పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు సోమవారం నిర్వహించారు. విజేతలకు మంగళవారం బహుమతులు అందజేస్తామని ఇంఛార్జి ప్రధానో పాధ్యాయులు వెంకట శ్రీధర్‌తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.శేషారత్నం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'జగనన్న బడుగు వికాసం' సబ్సిడీల విడుదలకు డిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం

జగనన్న బడుగు వికాసం పథకం లోని పలు రకాలైన వాహనాలు తీసుకున్న వాహన దారులకు ప్రభుత్వం వెంటనే సబ్సిడీ లు విడుదల చేయాలని దళిత బహుజన మహిళా శక్తి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దళిత బహుజన మహిళా శక్తి జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి మాట్లాడుతూ దళితులు ఆర్థికంగా పారిశ్రామికంగా ఎదగడానికి ఎస్‌సి,ఎస్‌టి సబ్ ప్లాన్ ద్వారా కొన్ని పథకాలు తీసుకువచ్చిన వాటిలో జగనన్న బడుగు వికాసం లో కొంతమంది దళిత మహిళలు వాహనాలు తీసుకున్నారని, తీసుకున్న వాటికి 3సంవత్సరాలైన ఇప్పటివరకు సబ్సిడీలు రాలేదని అన్నారు, కొంతమందికి సబ్సిడీ సాంక్షన్ లెటర్లు కూడా ఇప్పటివరకు రాలేదని దీనికి ప్రత్యేక మెకానిజం ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుత జగనన్న బడుగు వికాసం పథకానికి ప్రైవేట్ బ్యాంకు లు రుణాలు ఇస్తున్నా,. ప్రభుత్వ బ్యాంకు లు సహకరించడం లేదన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ బ్యాంకులకు రుణాలు ఇవ్వాలని ఆదేశించాలన్నారు. జగనన్న బడుగు వికాసంలో ప్రస్తుతం 45శాతం సబ్సిడీ ఇస్తున్నారని 70శాతానికి పెంచాలని డిమాండ్ చేసారు. దళిత బహుజన మహిళా శక్తి అధ్వర్యంలో గ్రామానికి 15 నుండి 20 మందిని మహిళా పారిశ్రా


కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

మిక వేత్తలను తయారు చేయడమే లక్ష్యం అన్నారు. అనంతరం జెసికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డిబిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కాశీ పద్మా వతి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కో -ఆర్డి నేటర్ భూల తులసీముని, జల్లి మహాలక్ష్మి, నవుంద్రు శ్రీని వాస్, మద్దా నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వాడివేడిగా మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఎంపిపి మేడిశెట్టి సత్య వేణి దుర్గారావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో 19 గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు . పలు సమస్యలపై సభ్యులు ఏకరువు పెట్టారు. దీనిపై అధికారులు సమాధానం చెప్పారు. కార్యక్రమలో భాగంగా రిటైర్డ్ ఆర్మీ జవాన్ పలివెల సత్య నారాయణ, రిటైర్డ్ ఉద్యోగి శీలం సత్యనారాయణ మూర్తిలను సన్మానించారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

7వ వార్డు సభ్యురాలిగా చినమంగ ఏకగ్రీవం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

కూనవరం పంచాయతీ 7వ వార్డు సభ్యురాలుగా పెయ్యల చిన మంగ ఏకగ్రీవం అయ్యారు. ఆ వార్డు సభ్యురాలు కోలాటి అక్కమ్మ మృతి చెందడంతో ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు. పెయ్యల చిన మంగ, వరసాల కరుణ కుమారిలు నామినేషన్ దాఖలు చేశారు. కరుణ కుమారి అందజేసిన పత్రాలు సక్రమంగా లేకపోవడంతో ఈనెల 11న జరిగిన పరిశీలనలో కరుణ కుమారి నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. దీంతో చిన మంగ ఎన్నిక ఏకగ్రీవమైనట్టు సోమవారం ఎన్నికల అధికారి అంబాజీపేట ఇఒపిఆర్‌డి మమత ప్రకటించారు. ధ్రువీకరణ పత్రాన్ని చిన మంగ కు అందజేశారు.కార్యక్రమంలో సర్పంచ్ వాకపల్లి ఈశ్వరి, మాజీ సర్పంచ్ పండు వెంకటేశ్వర రావు, వాకపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓదుర్రు ఉపఎన్నికల బరిలో నలుగురు అభ్యర్థులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఈనెల 19న జరగనున్న రామచంద్రపురం మండలంలోని ఓదర్రు గ్రామ పంచాయితీ ఉప ఎన్నికలలో నలుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. ఆరుగురు నామినేషన్లు దాఖలు చేసిన చివరికి ఇద్దరు అభ్యర్థులు ఉపసంహరించుకోవడంతో బరిలో నలుగురు మిగిలారు వీరికి సోమవారం ఎన్నికల అధికారి గుర్తులు కేటాయించారు. కోణాల అనంతలక్ష్మికి మంచం గుర్తు, తాతపూడి గంగ భవానికి కత్తెర గుర్తు, బుంగ బుల్లమ్మకు ఉంగరం గుర్తు, వింజమల్ల విమల కుమారికి బుట్ట గుర్తును కేటాయించినట్లు సోమవారం ప్రకటించారు.

చంద్రబాబు పర్యటన విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-మండపేట

జిల్లాలో టిడిపి జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుపర్యటనను విజయవంతం చేయాలని పెద్దాపురం ఎంఎల్ఎ చినరాజప్ప అన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడుతూ ఈనెల 16న రాజమహేంద్రవరం నుంచి మడికి, దుళ్ళ మీదుగా మండపేట నియోజకవర్గంలో ప్రవేశించి ఏడిదలో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం బైపాస్ రోడ్డు మీదగా రాజారత్న సెంటర్ కు చేరుకుని అక్కడి నుంచి రోడ్ షో ద్వారా కలువపువ్వు సెంటర్ కు చేరుకుని బహిరంగ సభలో పాల్గొంటారు. బహిరంగ సభ అనంతరం ఆలమూరు రోడ్డులో ఉన్న కల్యాణమండపంలో రాత్రికి బస చేస్తారన్నారు. 17న కార్యకర్తలు, నాయకులతో ఇష్టాగోష్టి అనంతరం ఆలమూరు మీదుగా కొత్తపేట నియోజకవర్గం చేరుకుని రావులపాలెం, కొత్తపేట రోడ్ షో సభల అనంతరం అమలాపురంలో రాత్రి బసకు చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉంగరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం(అల్లవరం):** అల్లవరం మండలంలో టిడిపి మండల పార్టీ కార్యాలయం వద్ద మండల టిడిపి అధ్యక్షులు దెందుకూరి సత్యనారాయణరాజు అధ్యక్షతన టిడిపి నాయకులు, కార్యకర్తలు సమావేశం సోమవారం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

జరిగింది. అమలాపురం టిడిపి ఇంఛార్జి అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా ఈ నెల 18 వ తేదీన అమలాపురం నియోజకవర్గంలో పర్యటిస్తారన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కొత్తపేట :** చంద్రబాబు ఈ నెల 17న కొత్తపేట నియోజకవర్గంలో చేయబోయే పర్యటన విజయవంతం చేయాలని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్ బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక కొత్తపేట కాపు కల్యాణ మండపంలో నియోజకవర్గ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడుతూ రావులపాలెం మండలం పరిషత్ కార్యాలయం సమీపంలో చంద్రబాబు బహిరంగ సభ నిర్వహిస్తారని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'కొబ్బరి' ఆధారిత పరిశ్రమల స్థాపనకు చొరవచూపాలి

ప్రజాశక్తి-అమలాపురం

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను నిబంధనలకు లోబడి స్థానికంగా లభించే కొబ్బరి తో విలువ ఆధారిత పరిశ్రమల స్థాపన కొరకు ఎంపిక చేయాలని జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారుల ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్ సూచించారు. సోమవారం జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతులు అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సభ్యు లతో స్థానిక కలెక్టరేట్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన కొరకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రభుత్వ రాయతీలతో ప్రోత్సహిస్తూ స్థానికం గా లభించే కొబ్బరి ముడి సరుకుతో కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల స్థాపన దిశగా ప్రత్యేక చొరవ చూపి స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుదలకు పాటుపడాలని సూచించారు. పరిశ్రమ స్థాపించి నడపగలననే ధృడ సంకల్పంతో ఉన్న పారిశ్రామికవేత్తలు గుర్తించాలన్నారు. సమావేశంలోఅధికారులుపాల్గొన్నారు.

అనధికార లే అవుట్‌పై చర్యలు


ప్రజాశక్తి-అయినవిల్లి

మండలంలోని సిరిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల అనధికార లే అవుట్‌పై అధికారులు చర్యలు చేపట్టారు. సర్వే నెంబరు 151-2 లో 1.25 ఎకరం భూమి నందు ప్రభుత్వ అనుమతులు పాటించకుండా అనధికార లే-అవుట్ నాన్ లే-అవుట్ ద్వారా జరుగుతున్న ప్లాట్ల అమ్మకాలను, కొనుగోలును నిలుపుదల చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని గత నెల 24న స్పందన - జగనన్నకు చెబుదాం నందు అదే గ్రామానికి చెందిన కాంద్రేగుల మణికంఠ స్వామి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పై అధికారులు స్పందించారు నాన్ లే-అవుట్ ని నిలుపుదల చేశారు. భూ యజమాని అయిన పొట్ట పోతు రామలక్ష్మికి ల్యాండ్ కన్వర్షన్ త్వరితగతిన పూర్తి చేయాలని అనంతరం అనుమతులు తీసుకుని అమ్మకాలు జరపాలని నోటీసు జారీ చేశారు. ఈ లే -అవుట్ అనధికారిక లే - అవుట్ అని, ఈ లే అవుట్ లో స్థలములు కొన్న వారికి గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు ఇవ్వబడవు అని అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

విద్యకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-అంబాజీపేట

నాడు-నేడుతో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. చిరతపూడిలో చిట్టిచెరువుగట్టు నాడు-నేడు పాఠశాల నిర్మాణ పనులను స్థానిక వైస్ ఎంపిపి నేతల నాగరాజుతో కలిసి ఆయన పరిశీలించారు. నాణ్యతతో నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. అనం తరం విద్యార్థులతో కలసి భోజనం చేసి పరిశీలించారు.


ప్రమాణ స్వీకారంచేస్తున్న శ్రీనివాసరావు, డైరెక్టర్లు

ఐ.పోలవరం సొసైటీ కార్యవర్గ ప్రమాణ సీకారం

ప్రజాశక్తి -ఐ.పోలవరం

మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనం వద్ద సోమవారం సొసైటీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. సొసైటీ అధ్యక్షులు విత్తనాల శ్రీనివాసరావు, డైరెక్టర్లు దంగుడు బియ్యం గోపాలకృష్ణ, సాధనాల రాజేశ్వరి ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక సర్పంచ్ దంతులూరి రాఘవరాజు అధ్యక్షతన, వైసిపి మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకట పతిరాజు, కొర్లపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, ఎంపిపి మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్ పి టి సి సభ్యులు ముదునూరి సతీష్ రాజు సమక్షం లో ఈ కార్యక్రమం జరిగింది. మురమళ్ల శాఖ కేంద్ర సహకార బ్యాంకు మేనేజర్ ఎం.చంద్రశేఖర్, ఏలూరి ఆదినారా యణ,సుంకర నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



మహిళా ప్రజాప్రతినిధులకు చీరల పంపిణీ

ప్రజాశక్తి-ఆలమూరు

మండల పరిషత్ కార్యాలయంలో మహిళా ప్రజా ప్రతినిధులకు సోమవారం గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు చీరలను పంపిణీ చేశారు. ముందుగా మండల పరిధిలోని మహిళా సర్పంచులు,


చీరలు అందజేస్తున్న సర్పంచ్ రాంబాబు

మహిళా ఎంపిటిసి సభ్యులకు సర్పంచ్ రాంబాబు శ్రావణ మాస శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా ప్రజాప్రతినిధులను గుర్తించి తెలుగు సాంప్రదాయ పద్ధతిలో దుస్తులు అందించిన సర్పంచ్ రాంబాబును వారు అభినందించారు.

కె.గంగవరం ఎస్ఐగా జానీబాషా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రామచంద్రపురం


జానీబాషా,ఎస్ఐ

కె.గంగవరం ఎస్ఐగా జానీ భాషా సోమవారం బాధ్యతలు చేపట్టారు. నగరం ఎస్ఐగా పనిచేస్తున్న ఆయన బదిలీపై కె.గంగవరం పోలీస్‌స్టేషన్ కు వచ్చారు. అంతకుముందు ఇ క్కడ పని చేసిన ఎస్ఐ చిరంజీవి సీతానగరం బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకు పోలీస్ స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పట్టణ అభివృద్ధికి నిధులు

ప్రజాశక్తి-మండపేట

పట్టణ సుందరీకరణలో భాగంగా 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని 50 సెంట్రల్ డివైడర్ విద్యుత్ పోల్స్ కు త్రివర్ణ పతాక రంగులో అమర్చిన ఎల్ఇడి లైట్లను మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి స్విచ్ ఆన్ చేసి సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో పట్టణ అభివృద్ధికి, సుందరీకరణకు అత్యధిక నిధులు వెచ్చిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ త్రిపర్ణ రామ్ కుమార్, వైస్ ఛైర్పర్సన్ పిల్లి గణేశ్వరరావు, వైసిపి టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, అసిస్టెంట్ ఇంజినీర్లు కె.వి.వి సత్యనారాయణ, డి. పవన్ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'నాభూమి-నాదేశం'

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల నా భూమి-నాదేశం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వివరాలు **మండపేట :** ఏడిద గ్రామంలో నాభూమి నాదేశం కార్యక్రమంలో భాగంగా అమరవీరులకు సోమవారం నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యు.వీర్రాజు, సచివాలయ, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు :** దేశభక్తిని పెంపొందించేందుకు నా భూమి-నాదేశం కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని సర్పంచ్ కట్టా శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు తాడి మెహర్ ఆదిత్య రెడ్డి అన్నారు. వారి ఆధ్వర్యంలో జొన్నాడలో నాభూమి - నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరవీరుల స్మనార్థం మొక్కలు నాటి, శిలాఫలకంను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి చిక్కాల వీరమాత, వార్డు మెంబర్లు గెద్దాడ ఆనందరావు, యామన శ్రీనివాస్, జనిపల్లి సుబ్రహ్మణ్యం, తాడి శ్యామ్ సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **అంబాజీపేట :** నా భూమి నా దేశం నేల తల్లికి నమస్కారం వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా సోమవారం గంగలకుర్రు పంచాయతీలో స్వాతంత్ర సమర యోధులు స్వర్గీయ.వాడ్రేవు జగ్గరాజు మనవడు వెంకటేశ్వర్లు కు సర్పంచ్ కాంద్రేగుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎంపిపి


జొన్నాడలో మొక్క నాటుతున్న సర్పంచ్, ఉప సర్పంచ్ లు

దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి లక్ష్మీపతిలు ఘనంగా సత్కరించారు. అజాదీకా అమత మహోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు నెల్లి ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి ఎన్.సత్యవేణి, విఆర్ఒ నాగేశ్వరరావు, నాగన్న ,నెల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం :** ఐలాండ్ గ్రామమైన శేరిలంకలో నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఎంపిటిసి సభ్యురాలు కొండేపూడి గంగాభవాని, సర్పంచ్. కె.భద్రరావు పాల్గొని జెండా వందనం కార్యక్రమం నిర్వహించారు. దేశ రక్షణలో సైనికుల పాత్రను కొనియాడారు. **కొత్తపేట:** మండల పరిధిలోని మోడేకుర్రు గ్రామం నందు సోమవారం ఆజాదీకా ఆమృత్ మహోత్సవలో భాగంగా నా భూమి నా దేశం అను కార్యక్రమము సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపిపి మార్గన గంగాధర్ రావు పాల్గొని ప్రతిజ్ఞ చేయించారు

పట్టా దారు పాస్ పుస్తకాల కోసం డిమాండ్

ప్రజాశక్తి-ఆలమూరు

ఇరవై రెండేళ్లగా పట్టా భూములను సాగు చేస్తున్న దళిత రైతులకు ఆన్లైన్ చేసి పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని మండలంలోని బడుగువానిలంకకు చెందిన పలువురు రైతులు అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్పందన, తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, తమ నిరసన తెలియజేస్తూ ఆందోళనకు దిగారు. దళిత రైతుల సమస్యలు పరిష్కరించలేని స్పందన కార్యక్రమం మాకు వద్దు అంటూ నినాదాలు చేశారు. అధికారులు వినతిపత్రం ఇవ్వాలని కోరగా మేము కొన్ని వందల సార్లు ఇచ్చామన్నారు. మా సమస్య పరిష్కరి ంచాలంటూ వారు ఆందోళన చేశారు. స్పందనలో ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు అడ్డుకోవడంతో కార్యాలయం ముందు బైటాయించి ఆందోళనకు దిగారు. అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.సత్తిబాబు, పి.వెంకట్ నాయుడు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కేటరింగ్ అసోసియేషన్ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-ఆలమూరు

కోనసీమ కుకింగ్ అండ్ కేటరింగ్ అసోసియేషన్ అభివృద్ధికి మండల కేంద్రానికి చెందిన పారిశ్రామికవేత్త, మురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మేరకు సోమవారం అమలాపురంలో నూతన అసోసియేషన్ ప్రారంభ సమయంలో పాపారావు తనయుడు వంటిపల్లి మురళీకష్ణ సభ్యులకు రూ.లక్ష నగదు అందజేశారు. దీంతో మురళీకృష్ణను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, మెమెంటోను అందజేశారు. ఆయన మాట్లాడుతూ సుదీర్ఘంగా ఉన్న 777, కోనసీమ రైస్ బ్రాండ్ల నాణ్యతను వివరించారు. అలాగే అసోసియేషన్ అభివృద్ధికి సహకరించిన పాపారావుకు అభినందనలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

ఎరువుల దుకాణంలో విజిలెన్స్

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని అర్తమూరులో శ్రీ కల్కి చెన్నకేశవ ఏజెన్సీస్ దుకాణంలో విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేకపోవడం, స్టాక్ బోర్డు అప్‌డేట్ చేయకపోవడం, గ్రౌండ్ స్టాక్‌కు, స్టాక్ రిజిస్టర్‌కు తేడాలు ఉండడంతో షాపుపై 6ఎ కేసు నమోదు చేశారు. సుమారు రూ.1,865 విలువ గల 315 కిలోల యూరియాను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

మీనానగరంలో సెబ్ తనిఖీలు

ప్రజాశక్తి - చాగల్లు

కొవ్వూరు సెబ్ స్టేషన్ పరిధిలో చాగల్లు గ్రామ శివారు మీనానగరంలో సెబ్ ఇన్‌స్పెక్టర్ ఐటివిఎస్.సత్యనారాయణ ఆదేశాల మేరకు సోమవారం తనిఖీలు నిర్వహించారు. సారా కేసులో పాతనేరస్తుడు బెజవాడ శ్రీనివాసరావును అదుపులోనికి తీసుకొని తహశీల్దార్ ఎదుట హాజరుపరిచారు. బైండోవర్ చేశామని సత్యనారాయణ తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సెల్ ఫోన్ ఎక్కువగా చూస్తున్నాడని తల్లిదండ్రులు మందలించడంతో సామర్లకోట మండలం హుస్సేన్ పురం గ్రామానికి చెందిన గుబ్బల సురేష్(14) ఇంటి నుంచి పరారయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సైకిల్ రిపేర్ చేయించుకుంటానని చెప్పి అలిగి ఇంట్లోంచి వెళ్లిపోయాడని తండ్రి గుబ్బల నాగేశ్వరరావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సురేష్ ఇంటి నుంచి వెళ్లే సమయంలో ఎరుపు నలుపు చారల టీషర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. బాలుని ఆచూకీ తెలిస్తే సామర్లకోట సిఐ 9440796568, ఎస్ఐ 9701626506 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సిఐ దుర్గాప్రసాద్ కోరారు.

ఎసిబి వలలో లైన్‌మ్యాన్

ప్రజాశక్తి- అన్నవరం

ఎసిబి వలలో లైన్‌మ్యాన్ చిక్కాడు. సోమవారం శంకవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన ఎస్.శ్రీను అనే రైతు తన పొలంలో బోర్ వేసికొనేందుకు లైన్‌మ్యాన్ అల్లు తాతాజీ రూ.5 వేలు లంచం అడిగాడు. దీంతో రైతు శ్రీను ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. శంకవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లంచం తీసుకుంటుండగా అధికారులు దాడి చేసి పట్టుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి శివారు జాతీయ రహదారిపై ఎన్‌టి.రాజాపురం కూడలి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గూడాల నవీన్ కుమార్ బైకుపై రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో నవీన్‌కుమార్ ఎగిరి మరొక కారుపై పడటంతో తలకు తీవ్రగాయమైంది. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని యువకుడిని రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్ తీసుకెళ్లారు.

17న వికాసలో ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - కాకినాడ

వికాస కార్యాలయంలో ఈ నెల 17న డబ్ల్యుఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీలో మెడికల్ కోడింగ్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కెవిఎల్.రావు సోమవారం ప్రకటనలో తెలిపారు. బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, బిఎస్‌సి లైఫ్ సైన్స్ బ్యాక్ గ్రౌండ్ కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.2లక్షల జీతం, ఇన్సెంటివ్స్ ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 17న కలెక్టరేట్ ప్రాంగణంలో వికాస కార్యాలయం వద్ద ఉదయం 9గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్సులతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 7799376444 నెంబర్‌ను లేదా www.vikasajobs.com వెబ్ సైట్‌ను సంప్రదించలన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - యానాం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు స్థానిక బాలయోగి స్టేడియం ముస్తాబైంది. మంగళవారం జరిగే వేడుకలకు పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణన్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సమక్షంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని ఆర్ఎఒ తెలిపారు.

సీనరేజి వసూలుకు డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ మండలం తూరంగి పంచాయతీ పరిధిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేయిస్తున్న లే అవుట్లలో నింపుతున్న గ్రావెల్‌కు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించిన సీనరేజీ చెల్లించారా లేదా సంబంధిత భూ యజమానుల రికార్డులు తనిఖీ చేసి నిగ్గు తేల్చాలని ఎంపిటిసి మాజీ సభ్యులు పితాని వెంకటరాము స్పందనలో ఫిర్యాదు చేశారు. తూరంగిలో వందలాది ఎకరాల్లో లేఔట్లు వేస్తూ గ్రావెల్‌తో పూడ్చుతున్నారన్నారు దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలన్నారు. ఫిల్లింగ్, మైనింగ్, విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి రావాల్సిన సొమ్మును పూర్తిగా జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇద్దరికి కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి- కాకినాడ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఇద్దరు ఉద్యోగుల కుటుంబీకులకు సోమవారం కలెక్టరేట్‌లో డాక్టర్ కృతికాశ్ల కారుణ్య నియామకం కింద ఇద్దరికి నియామక పత్రాలను అందించారు. గ్రామ సచివాలయంలో గ్రేడ్-2 విఆర్ఒ, సంక్షేమం అండ్ విద్యా కార్యదర్శిగా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్స్ ఆర్డర్స్ ఇచ్చామన్నారు.

సాగునీటిని విడుదల చేయాలని ధర్నా

ప్రజాశక్తి - జగ్గంపేట

నియోజకవర్గంలోని పొలాలకు పుష్కర కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయాలంటూ తహశీల్దార కార్యాలయం వద్ద టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. గండేపల్లి మండల పరిధిలో ఉన్న తాళ్లూరు, రాజపూడి, నాయకంపల్లి లిఫ్ట్‌కు మరమ్మతులు చేసి పుష్కర నీటిని వెంటనే విడుదల చేయాలని నినదించారు. తొలుత టిడిపి కార్యాలయం నుంచి జగ్గంపేట సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడారు. నెల రోజుల క్రితమే సాగునీటి ఇబ్బందులపై అధికారులు, ప్రజాప్రతినిధులను కోరామన్నారు. అనంతరం ఉమ్మడి గోదావరి జిల్లాల నేతలతో బస్సు యాత్ర చేసి తాళ్లూరు, రాజపుడి లిఫ్టులను పరిశీలించామన్నారు. అయినా అధికారుల్లో స్పందన లేదన్నారు. అధికారుల తీరుకు నిరసనగా ధర్నా చేశామన్నారు. ఇప్పటికైనా స్పందించి సాగు నీరు అందించాలన్నారు. లేకుంటే కలెక్టరేట్ వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్.అప్పలరాజు, వేములకొండ జోగారావు, కొత్త కొండబాబు, బుల్లపు చౌదరి, రేఖ బుల్లిరాజు, బండారు చిన్నయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టిడిపి నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహిస్తున్న జ్యోతుల నెహ్రూ

అమరుల త్యాగాల వల్లే స్వాతంత్ర్య ఫలాలు

అమరవీరుల కుటుంబాలకు ఘన సత్కారం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

అమరవీరుల త్యాగాలవల్లే స్వాతంత్రోద్యమ ఫలాలను అనుభవించ గలుగుతున్నామని ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. అజాదిక అమత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక వివేకానందపార్కు ఆవరణలో 'నా భూమి- నా దేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఎల్‌సి పద్మశ్రీ, కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైసిపి నగర అధ్యక్షులు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మార్కెట్‌కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు. తొలుత పార్కు ఆవరణలోని భరతమాత విగ్రహానికి, స్వాతంత్రోద్యమకారుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కార్గిల్‌తోపాటు భారతసరిహద్దులను, నక్సలైట్ల చేతుల్లో హతమైన అమరుల కుటుంబ సభ్యులను సత్కరించారు. పార్కు ఆవరణలో మొక్కలు నాటారు. అమరవీరుల పేరిట ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి కెప్టెన్ సత్యప్రసాద్, ఎస్ఐ సత్యకుమారి, కార్యదర్శి ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డిసిపి హరిదాసు, ఎసిపి నాగశాస్త్రులు, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంల గొడౌన్ పరిశీలన

కాకినాడ : కలెక్టరేట్ వద్ద ఉన్న ఇవిఎం, వివిప్యాడ్‌ల గొడౌన్‌ను కలెక్టర్ కృతికాశుక్లా రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక శాఖల అధికారులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇవిఎంల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ప్రతి నెలా గోడౌన్లను తనికీ చేసి నివేదిక పంపిస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎన్‌వివి.సత్యనారాయణ, తహశీల్దార్ సీతాపతిరావు, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

జగన్ పాలనలో దళితులకు అన్యాయం

ప్రజాశక్తి - కోటనందూరు

జగన్ పాలనలో దళితులకు అన్యాయం జరిగిందని టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు కొల్లాబత్తుల అప్పారావు అన్నారు. తునిలోని టిడిపి కార్యాలయంలో పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు అధ్యక్షతన సోమవారం నియోజకవర్గం ఎస్‌సి సెల్ నాయకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అప్పారావు మాట్లాడారు. దళిత ఓట్లతో అధికారంలోకొచ్చిన జగన్ ఈ నాలుగున్నరేళ్లలో ఎక్కువ అన్యాయం చేసింది దళితులకే అన్నారు. బాబు హయాంలో క్రిస్మస్ కానుక, పేదలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారన్నారు. జగన్ అధికారం చేపట్టిన తరువాత వీటిని రద్దు చేశారన్నారు. జగన్ పాలంలో నిత్యావసర వస్తువులు ధరల విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. ఎస్‌సికార్పొరేషన్ నిధులు దారి మళ్లించి అన్యాయం చేశారన్నారు. ఈ పలివెల రవి, అనంత కుమార్, ఎన్.సత్యనారాయణ, బి.సత్యనారాయణ, ఎ.జార్జి తదతరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేత

ప్రజాశక్తి -కరప

గురజానపల్లి స్కూలుకు రూ.45వేల విలువ చేసే సౌండ్ సిస్టంను దాత డాక్టర్ విష్ణుమూర్తి అందించినట్లు హెచ్ఎం ఎ.సాయిమోహన్ తెలిపారు. సోమవారం స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీన్ని డాక్టర్ విష్ణుమూర్తి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుకుని ఈ స్థాయికి చేరుకున్నాను అన్నారు. విద్యార్థులందరూ బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివి.రమణమూర్తి, టి.వేణుగోపాల్, ఎ.సూర్యనారాయణ, శోభాకర్ తదితరులు పాల్గొన్నారు.



తనిఖీలు చేపడుతున్న ఆర్జెడి నాగమణి

జిఇఆర్ సర్వేను పూర్తి చేయాలి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వేను నూరు శాతం పూర్తిచేసేలా విద్యాశాఖ సిబ్బంది కృషి చేయాలని ఆర్‌జెడి నాగమణి ఆదేశించారు. సోమవారం సామర్లకోటలోని జగ్గమ్మ గారి పేట మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. జగనన్న విద్యా కానుక, మధ్యాహ్నం భోజన పథకం, హాజరు పట్టీలను పరిశీలించారు. నాగమణి మాట్లాడుతూ బడి ఈడు గల పిల్లలందరు బడిలో ఉండే నిమిత్తం కొన్ని రోజులుగా సర్వే జరుగుతుందన్నారు. ప్రతి సచివాలయ పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటీర్ పరిధిలో ఉన్న యాప్ ద్వారా ఈ సర్వే పూర్తి చేసి ఎన్‌రోల్‌మెంట్ పెంచే విధంగా చూడాలన్నారు. తగిన శ్రద్ధ తీసుకుని జిఇఆర్ సర్వే నూరుశాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 పి.పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆనూరు దళితపేటలో మౌలిక వసతులు కల్పించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని ఆనూరు దళితపేటలో మౌలిక వసతులు కల్పించాలని రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాలనీలో 20 ఏళ్లుగా దళితులు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. నేటికీ విద్యుత్, మరుగుదొడ్లు, డ్రెయినేజీ వంటి సదుపాయాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, నాయకులు డి.సురేష్, పి.బులిసత్తయ్య, పి.నాగరాజు, సత్యవతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

మంత్రి లక్ష్మీనారాయణన్‌కు ఎంఎల్ఎ స్వాగతం

ప్రజాశక్తి - యానాం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు యానాం విచ్చేసిన పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణన్‌కు స్థానిక ప్రభుత్వ అతిథిగృహం వద్ద ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ సోమవారం ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు. అనంతరం యానాం నియోజకవర్గంలో ఉన్న పలు అంశాలపై చర్చించారు. దానిలో ముఖ్యంగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అందుకు ఆర్ఒ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సాగునీరు అందక పంట భూములు ఎండిపోతున్నాయని అన్నారు. రోడ్ల నిర్మాణం కోసం నిధులు విడుదలైనా పనులు మాత్రం ముందుకు సాగడం లేదని మంత్రికి వివరించారు. ప్రతి ఏటా వరద ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, దానికి సంబంధించి రూ.190 కోట్లతో రక్షణ గట్టు నిర్మాణం చేపట్టాలని కోరారు. అధికారులతో సమీక్షించి సమస్యలు పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి లక్ష్మీనారాయణన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.



మంత్రిని సత్కరిస్తున్న ఎంఎల్ఎ అశోక్

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - యానాం

స్థానిక దరియాలతిప్ప రీజెన్సీ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న సుమారు 32 ఎకరాల భూమిని కొంతమంది వ్యక్తులు కబ్జా చేశారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బిసి సంఘాల నాయకులు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. బయన్న, మట్టపర్తి చిన్న, కర్రి రాంబాబుతో పాటు కొంత మంది వ్యక్తులు కలిసి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి భూమిని కబ్జా చేశారని వినతి పత్రంలో పేర్కొన్నారు. గత నాయకుల అండదండలతో బయన్న అనే వ్యక్తి ప్రభుత్వ భూములు కబ్జా చేశాడని ఆరోపించారు. తమ దగ్గర పూర్తి ఆధారాలు ఉన్నాయని నాయకులు, బాధితులు ఎంఎల్ఎ అశోక్‌కు వివరించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు త్వరలో ఫిర్యాదు చేసి భూ కబ్జాదారులకు శిక్షపడేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బిసి నాయకుడు పెద్దింశెట్టి వెంకటేశ్వర్లు, మల్లాడి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మంత్రి సమీక్ష

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ సమక్షంలో ఆర్ఎఒ మునిస్వామి, పిడబ్ల్యుడి అధికారులు, మత్స్యశాఖ అధికారులతో మంత్రి లక్ష్మీనారాయణన్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పనులు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. మత్స్యకారులకు రావాల్సిన నష్టపరిహారంపై మత్స్య శాఖ అధికారులను వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యుడి ఇఇ వీర సెల్వం, ఎఇ కాళ్ల నాగరాజు, పిల్లి భాస్కర్, మత్స్యశాఖ అధికారి డి.గొంతియ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో వారం రోజులుగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న మేరా మిట్టీ - మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ అరుల్‌ప్రకాశం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక ఇందిరాగాంధీ మార్కెట్ కాంప్లెక్స్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలోని ఎన్‌టిఆర్ స్మారక మందిరం అన్నా క్యాంటీన్ వద్ద టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో సోమవారం అన్నాదానం చేశారు. ముత్యాల సత్తిరాజు జ్ఞాపకార్థం అతని కుమారుడు గండేపల్లి మండలం యర్రంపాలెం తెలుగు రైతు అధ్యక్షులు ముత్యాల వీరభద్రరావు ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్ అప్పలరాజు, గండేపల్లి, జగ్గంపేట మండలాల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం పాల్గొని పేదలకు అన్నం వడ్డించారు. మోహనరావు మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లను రద్దు చేయడం తదన్నారు. దీంతో స్వచ్ఛందంగా అన్నదానం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, బి.రామకృష్ణ, దాపర్తి సీతారామయ్య, వేములకొండ జోగారావు, కంటిపూడి రామారావు, ముత్యాల భాస్కరరావు, మాజీ సర్పంచ్ ముత్యాల వీరభద్రరావు, గుమ్మల్ల వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ఓటర్ల సర్వేను బాధ్యతగా చేపట్టాలి

ప్రజాశక్తి - పెదపూడి

సమగ్ర ఓటర్ల జాబిత సర్వేను బాధ్యతగా చేపట్టాలని అనపర్తి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి శ్రీనివాసు అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు, తొలగింపులు మొదలగు వాటికి సంబంధించిన క్లెయిమ్స్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఓటర్ల సవరణ మరింత కచ్చితంగా పారదర్శకంగా రూపొందించేందుకు కృషి చేయాలన్నారు. సర్వేలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.సుభాష్, డిటి రామ్‌కుమార్, ఆర్ఐ ఎం.త్రివేణి, విఆర్ఒలు గొల్లపల్లి అంజిబాబు, కరెడ్ల రమేష్, పంపన శ్రీనువాసు, చంటి తదితరులు పాల్గొన్నారు

తాటిపర్తిలో ప్రభుత్వ భవనాలకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తాటిపర్తిలో రూ.80 లక్షలతో నిర్మించిన సచివాలయం నూతన భవనం, విలేజ్ క్లినిక్ భవనాలను సోమవారం కాకినాడ ఎంపీ వంగా గీతా, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరు దొరబాబు సోమవారం ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ గోపు సూర్యక్రాంతి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ గీత మాట్లాడారు. మహాత్మా గాంధీ కలలగన్న గ్రామ స్వరాజ్యం జగన్మోహన్ రెడ్డి పాలన ద్వారానే సాధ్యమవుతుందన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ ప్రజల వద్దకు ప్రజా సంక్షేమాన్ని తీసుకువెళ్లిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ సభలో జడ్‌పిటిసి సభ్యులు గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, వైస్ ఎంపిపి మిరియాల రాజ, ఎంపిడిఒ అశోక్‌కుమార్, పిఎసిఎస్ చైర్మన్ గోపు నారాయణమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కంటే వీర రాఘవరావు, ఆవాల లక్ష్మీనారాయణ, గోపు మురళి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని అమీనాబాద్ పంచాయతీ మాయాపట్నం ప్రజలు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ, తహశీల్దార్లకు వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎపిఆర్‌సిఎస్ జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు మాట్లాడారు. అమీనాబాద్ పంచాయతీ పరిధిలో మాయాపట్నం ప్రాంతంలోని ప్రజలు తాగునీరు అందక, ఉండడానికి ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంటింటికీ కొళాయి, పేదలందరికీ ఇళ్ల స్థలాలు అంటూ ప్రభుత్వం ప్రకటనలు గుప్పించడం తప్ప క్షేత్రస్థాయిలో సరిగా అమలు కావట్లేదన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా సముద్రం అలలకు తమ ప్రాంతం కోతకు గురై సముద్రంలో కలిసిపోతుందన్నారు. తాగునీటి కోసం సుదూరం ప్రయాణించి బిందె నీళ్ల రూ.20కి కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందన్నారు. తక్షణం సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడితి సతీష్, కుంచె అంజిబాబు, ఏడిది పెద్దబంగారయ్య, వి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఒ ఆధ్వర్యంలో బ్యాగులు, పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - గండేపల్లి

నీలాద్రిరావు పేటలో విఆర్ఒ(గ్రామ పున్ననిర్మాణ సంస్థ) ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. సంస్థ పిఒ శ్రీనువాస్, ఎపిఒ సుధాకర్, వాలంటీర్ రమాదేవి, ఎన్.పార్వతి, సర్పంచ్ ములంపాక సురేష్‌బాబు, గ్రామ పెద్దల సమక్షంలో వీటిని పంపిణీ చేశారు. సర్పంచ్ సురేష్‌బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్యను అందిచాలనే ఉద్దేశంతో విఆర్ఒ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌ను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా పోలీసు కవాతును ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్, అడిషనల్ ఎస్‌పి పి.శ్రీనివాస్ పరిశీలించారు. కవాతులో లోపాలను గుర్తించి, సిబ్బందికి సూచనలు చేశారు. జాతీయ పతాకానికి వందనం చేసే సమయంలో మైదానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. వారి వెంట అదనపు ఎస్‌పి(ఎఆర్) బి.సత్యనారాయణ, పెరేడ్ కమాండెంట్(ఎఆర్) డిఎస్‌పి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాలు తిమ్మాపురం రహదారిలోని పట్టాభి అగ్రో ఫుడ్స్ లోహిత బ్రాండ్ ఆధ్వర్యంలో సోమవారం జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. హెచ్ఎం కె.శ్రీదేవి, డ్రాయింగ్ టీచర్ డి.భాస్కర మూర్తి పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తామని సంస్థ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, సూర్యనారాయణ, రాము తెలిపారు.

స్పందనకు ఐదు అర్జీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోరుతూ ఐదు అర్జీలు అందాయని ఎఒ పద్మజ, డిప్యూటీ తహశీల్దార్ భానుకుమార్ తెలిపారు. స్థల ఆక్రమణదారులను ఖాళీ చేయించాలని, తొలగించిన విద్యుత్ మీటర్ పునరుద్ధరించాలని, భూమి రి సర్వే చేయించాలని అర్జీలు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఎడిఎ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.